క్లుప్తంగా

ప్రథమ చికిత్సతో ప్రాణాలు కాపాడవచ్చు

అగ్నిమాపక శాఖాధికారి శంకరరావు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆపద సమయాల్లో ప్రథమ చికిత్స ద్వారా వ్యక్తుల ప్రాణాలు కాపాడవచ్చని అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి శంకరరావు అన్నారు. కొండపల్లి ఐడీఏలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణ, ప్రాథమిక చికిత్స అంశాలపై శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు 136 మందికి మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన వారు తమ పరిసర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించి నివారణ చర్యలు చేపడతారని చెప్పారు. మైలవరం అగ్నిమాపక అధికారి నరేష్, ఐలా చైర్మన్ ఎంవీ రామలింగేశ్వరరావు, కార్యదర్శి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

ఇబ్రహీంపట్నం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్యశిబిరం స్థానిక మూడో వార్డు సచివాలయం పరిధిలో బుధవారం జరిగింది. కొండపల్లి మున్సిపాల్టీ వార్డు సచివాలయాల కో–ఆర్డినేటర్ లంకే అంకమోహనరావు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

విద్యుత్ శాఖాధికారుల తనిఖీ

ఇబ్రహీంపట్నం: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖాధికారులు బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విజయవాడ రూరల్ డివిజన్ ఈఈ జీబీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో 37 బృందాలు 3,160 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ వినియోగిస్తున్న 235 మందిపై కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.5.82 లక్షల అపరాధ రుసుం వసూలు చేశామని ఈఈ తెలిపారు. విజిలెన్స్ ఈఈ కమలకుమారి, డీఈఈ కేవై కొండలరావు, విజిలెన్స్ డీఈఈ నవీన్‌కుమార్, ఏఈ వైవీ కృష్ణారావు, వివిధ మండలాల డీఈఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ నరసింహారావు బాధ్యతల స్వీకారం



జి.కొండూరు: జి.కొండూరు తహసీల్దార్‌గా వీవీఎల్ నరసింహారావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన రోహిణీదేవి బదిలీపై వెళ్లగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా మల్కిపురం తహసీల్దార్‌గా పనిచేస్తున్న నరసింహారావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ధర్మకర్తల మండలి నియామకానికి ఆహ్వానం

విస్సన్నపేట: స్థానిక గంగాపార్వతి సమేత చంద్రశేఖరస్వామి (శివాలయం)దేవస్థానానికి ధర్మకర్తల మండలి నియామకానికి కాకినాడ ఉప కమిషనర్ దేవదాయ ధర్మాదాయ శాఖ ప్రకటన విడుదల చేసిందని దేవాలయ కార్యనిర్వహణాధికారి వై. సీతారామయ్య బుధవారం తెలిపారు. ఇతర వివరాలకు 78939 66233 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అధికారులను కలిసిన బీజేపీ నాయకులు

ఇబ్రహీంపట్నం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ ఉమాదేవి, తహసీల్దార్ బీఎస్వీఎస్ఆర్ఎల్ రాజును బీజేపీ మండల నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రూరల్ మండల ఇన్‌చార్జ్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో వారిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. నాయకులు చల్లా ఆంజనేయులు, కరుకుమల్లి సత్యవతి, తమ్మినేని మాధురి, నక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి

కొర్లమండ (విస్సన్నపేట): రైతులు సాగు నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా భూగర్భ జల, జల గణన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కొర్లమండ పెద్దచెరువు ఆయకట్టు రైతులకు పంట నీరు ప్రణాళిక కార్యక్రమంపై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యాన శాఖ ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి హెచ్ఓ నరేంద్ర వివరించారు. కార్యక్రమంలో భూగర్భ జల శాఖ సూపరింటెండెంట్ ఎంఎస్‌వీడీ ప్రసాద్, ఏపీడీ నుగుణరావు, శివనాగేశ్వరరావు, ఆశాలత, శివరాణి, గ్రామ ప్రముఖులు దేవరం రామచక్రవర్తి, భూషణం, రైతులు పాల్గొన్నారు.

గృహయోగం

- నెరవేరిన సొంతింటి కల
- జగనన్న కాలనీల్లో శరవేగంగా గృహ నిర్మాణాలు
- నియోజకవర్గంలో 3,742 గృహాల నిర్మాణం పూర్తి
- ఇప్పటివరకు రూ.98.32 కోట్ల వ్యయం



నూజివీడు పట్టణం అన్నవరం వద్ద జగనన్న కాలనీలో నిర్మిస్తున్న గృహాలు

నూజివీడు: పేదలకు సొంతింటి కల నెరవేరుతోంది. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, పట్టణంలో నివసిస్తున్న పేదల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీల్లో పక్కా గృహాల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా 113 లేఅవుట్లలో ప్రభుత్వం 6,645 గృహాలను, సొంత స్థలాలు ఉన్నవారికి 4,961 గృహాలను మంజూరు చేసింది. దీంతో సొంతిల్లు నిర్మించుకోవాలనే పేద కుటుంబాల కల కార్యరూపం దాలుస్తోంది. ఇదివరకెన్నడూ.. ఎక్కడా లేని విధంగా కనివినీ ఎరుగని రీతిలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు'లో భాగంగా ఆ కలను సాకారం చేస్తుండటంతో పేదల కళ్లల్లో వెలుగులు నిండుతున్నాయి. పక్కా గృహాలను నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఎప్పటికప్పుడే బిల్లులు మంజూరు చేస్తూ గృహాల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటోంది. దరఖాస్తు చేసుకున్న అతి తక్కువ రోజుల్లోనే, పైసా అవినీతికి ఆస్కారం లేకుండా, ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా ఇళ్ల స్థలాలను ప్రభుత్వం అందజేయడమే కాకుండా ఇళ్లను సైతం మంజూరు చేసింది. దీంతో పేదలు ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలకు తాము కొంత మొత్తాన్ని జత చేసుకుని గృహాలను నిర్మించుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు స్థలాన్ని ప్రభుత్వం పేదలకు అందజేసింది. గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు బిల్లుల సొమ్మును ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు అక్కౌంట్‌లోనే జమ చేస్తోంది.

తక్కువ ధరకే సిమెంట్, స్టీల్ సరఫరా..

జగనన్న లే అవుట్‌లలో గృహాలు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం ఒక్కో ఇంటికి 20 టన్నుల ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తోంది. ఐఎస్ఐ మార్కు ఉన్న నాణ్యమైన సిమెంట్, స్టీల్, ఇతర వస్తువులను మార్కెట్ ధరల కంటే తక్కువకే అందిస్తోంది. ఇసుకను మార్కెట్ యార్డులో స్టాకు పాయింట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి ఉచితంగా అందిస్తోంది. అలాగే లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఎదురైతే వలంటీర్ వద్ద ఉన్న యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే స్థోమత లేని వారికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ల నుంచి లబ్ధిదారులకు పావలా వడ్డీకే ప్రభుత్వం రుణాలు అందిస్తోంది.

నియోజకవర్గంలో 11,606 గృహాలు మంజూరు..

నియోజకవర్గంలోని నూజివీడు పట్టణంతో పాటు, నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాల్లో కలిపి లే అవుట్‌లు, సొంత స్థలాల్లో కలిపి 11,606 గృహాలు మంజూరు కాగా, వీటిలో ఇప్పటి వరకు 924 గృహాలు మాత్రమే ఇంకా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన గృహాల నిర్మాణం ప్రారంభమై పలు దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయి. 3,742 గృహాల నిర్మాణాన్ని సైతం పూర్తి చేసుకున్నాయి. 10,682 గృహాలు గ్రౌండ్ దశలో ఉండగా, వీటిలో బీబీఎల్ దశలో 3,267, బేస్‌మెంట్ లెవెల్‌లో 2,377, శ్లాబ్ దశలో 716, శ్లాబ్ పూర్తయినవి 580 గృహాలు ఉన్నాయి. లే అవుట్లలో నిర్మాణానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రభుత్వం నీటి వసతిని కల్పించింది. ప్రతి లే అవుట్‌లో విద్యుత్ సదుపాయంతో పాటు బోర్లు వేసి నీటి ట్యాంకులు ఏర్పాటు చేయడంతో నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా ఉంది. ఇప్పటి వరకు గృహ నిర్మాణాలకు గాను నియోజకవర్గంలో రూ.98.32 కోట్లను ప్రభుత్వం చెల్లించింది.

నూజివీడు పట్టణం, మండలంలో నిర్మిస్తున్న గృహాల వివరాలు

మండలం	మంజూరైన గృహాలు	ప్రారంభం కానివి	పూర్తయినవి	వివిధ దశల్లో ఉన్న గృహాలు
నూజివీడు	3,613	156	1,488	1,969
నూజివీడు(ప)	3,442	115	669	2,658
ముసునూరు	988	323	304	361
చాట్రాయి	1,121	269	241	611
ఆగిరిపల్లి	2,442	61	1,040	1,341
మొత్తం	11,606	924	3,742	6,940

సీఎం జగన్‌కు అండగా ఉంటాం



పదేళ్లుగా చాలీచాలని అద్దె భవనంలో నెలకు రూ.3 వేలు చెల్లిస్తూ నివసిస్తున్నాం. జగనన్న ప్రభుత్వంలో సెంటు స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు మంజూరు చేయడంతో పక్కా గృహాన్ని నిర్మించుకున్నాం. రూ.1.80 లక్షలకు మరికొంత నగదును సమకూర్చుకొని ఇంటిని నిర్మించుకున్నాం. సొంతింటి కల నెరవేరింది. సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉంటాం. – అనుమాల గాయత్రి, నూజివీడు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

ఆర్డీఓ భవానీ శంకరి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ భవానీ శంకరి

నూజివీడు: మండల స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని ఆర్డీఓ వై. భవానీ శంకరి అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం ఎన్నికలకు సంబంధించి ఈఆర్‌ఓలకు, సూపర్‌వైజర్లకు, ఆర్‌ఓలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉన్నతాధికారులు అడిగే రిపోర్టులను సకాలంలో పంపాలని, పదేపదే అడిగించుకోవద్దన్నారు. విధి నిర్వహణలో అలసత్వంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మండల స్థాయి అధికారులు టీమ్‌గా కలిసి పనిచేయాలన్నారు. ఏమాత్రం పొరపాట్లు చేసినా చర్యలు ఉంటాయని చెప్పారు. ఎన్నికల విధులకు సంబంధించి అధికారులు తమ సొంత నిర్ణయాలు తీసుకోవడానికి లేదన్నారు. ఓటర్ల తొలగింపు విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ఓట్ల తొలగింపునకు చాలా దరఖాస్తులు వస్తాయని, వాటన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే నిర్ణయం తీసుకోవాలన్నారు. అలాగే మండలాల్లోని అన్ని పోలింగ్ స్టేషన్లను విజిట్ చేసి వారంలోగా నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ, తహసీల్దార్లను ఆదేశించారు. అలాగే సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వివరాలను కూడా ఎస్ఐలను అడిగి నివేదికను ఇవ్వాలన్నారు. ప్రతిఒక్కరూ అంకిత భావంతో పనిచేసి ఎన్నికల నిర్వహణను విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించాలన్నారు. సమావేశంలో పలు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, డెప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

వైఎస్సార్ సీపీ మైలవరం ఇన్‌చార్జ్ తిరుపతిరావు



మాట్లాడుతున్న తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముస్లిం మైనార్టీల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో నూతనంగా నిర్మించిన మస్జిద్ ఎ యాహుయా మదర్సా మదీనా తుల్ ఉలూమ్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మస్జిద్‌ల మత గురువులు, మౌలానాలు, మతపెద్దలు చేసిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం తిరుపతిరావు యాదవ్ మాట్లాడుతూ సీఎం జగనన్న ముస్లిం మైనార్టీల పక్షపాతి అని, తన మంత్రివర్గ క్యాబినెట్‌లో అంజాద్ బాషాకు ఉప ముఖ్యమంత్రి పదవిని కేటాయించడమే అందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వ మంత్రివర్గ కూర్పులో ముస్లిం మైనార్టీలకు స్థానం కేటాయించని చంద్రబాబు 2019 ఎన్నికలకు ముందు ఇచ్చి మమ అనిపించారని గుర్తుచేశారు. ముస్లిం మైనార్టీలను గౌరవించి సముచిత స్థానాన్ని కల్పించిన సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లో అఖండ మెజారిటీతో గెలిపించుకుని మళ్లీ ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మైనార్టీలపై కూడా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌కే ఇమామ్‌వలీ, విజయవాడ రూరల్ మండల మాజీ అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యం..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్సార్ సీపీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జ్ షేక్ ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. వైఎస్సార్ కాలనీలో జరిగిన మస్జిద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. స్థానిక ముస్లిం మతపెద్దలతో మాట్లాడి వారికి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ కె. సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, ఎంపీటీసీ కల్పనా కిషోర్, అల్తాఫ్, కార్పొరేటర్లు షేక్ రెహమతున్నీసా, ఎండీ ఇర్ఫాన్, పి. చైతన్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలి

డీఎంహెచ్ఓ సుహాసిని



పాఠశాలల హెచ్ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

జి.కొండూరు: నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను ప్రతి ఒక్కరూ తప్పకుండా వేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుహాసిని అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 9వ తేదీన పంపిణీ చేయనున్న ఆల్బెండజోల్ మాత్రలను డీఎంహెచ్ఓ సుహాసిని చేతుల మీదుగా పాఠశాలలకు బుధవారం అందజేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ఫిబ్రవరి 9, 16 తేదీలలో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి డాక్టర్ ఉషారాణి, మండల వైద్యాధికారులు డాక్టర్ శిరీషా, డాక్టర్ శ్వేత, సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగులను నివారిద్దాం

చాట్రాయి: నులి పురుగులను నివారిద్దామని ఎంపీడీఓ మంగా కుమారి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు మందులను పంపిణీ చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో తప్పనిసరిగా నులి పురుగుల మాత్రలను విద్యార్థులకు అందించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరెడ్డి, సీహెచ్ఓ రమణ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ఆలయంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. గిరి ప్రదక్షిణ రహదారిని బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఆలయానికి నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. రూ. కోటితో చేపట్టిన గిరిప్రదక్షిణ రహదారిని త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. అనంతరం ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన భక్తులు రూ. 10,116లను అందజేసినట్లు వివరించారు. ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సహాయం చేయడమే క్రైస్తవం

అంతర్జాతీయ సువార్తికులు వైఎస్ విమలారెడ్డి



సేవకుల సదస్సులో మాట్లాడుతున్న విమలారెడ్డి

తిరువూరు: పేదవానికి సహాయ పడటమే క్రైస్తవ మత లక్ష్యమని, ఇందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అంతర్జాతీయ సువార్తికులు వైఎస్ విమలారెడ్డి అన్నారు. తిరువూరు మండలం లక్ష్మీపురం మనో గార్డెన్స్‌లో సేవకుల సదస్సును బుధవారం నిర్వహించారు. ఫాదర్ బాల అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న విమలారెడ్డి వాక్యోపదేశం చేశారు. పేదలను ఆదుకునేవారు పది కాలాలపాటు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించాలన్నారు. పేదలపై కనికరం, దయ లేనివారు పాలకులుగా అనర్హులని చెప్పారు. క్రైస్తవమతం పేర్కొన్న శాంతి, సమానత్వం, సహనం లేనివారు ప్రజలను పాలించేందుకు అర్హులు కాదన్నారు. తిరువూరు మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సుధారాణి, యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ పాస్టర్ మాదాసు ఫిలిప్, తిరువూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాస్టర్లు పాల్గొన్నారు.

రికార్డులను నవీకరించాలి

తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు



తిరువూరులో సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్

తిరువూరు: కొత్తగా బాధ్యతలు చేపట్టిన తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు బుధవారం వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. 3, 8 వార్డు సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఉదాసీనత వద్దని, ఎప్పటికప్పుడు రికార్డులు నవీకరించాలని ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష, వైఎస్సార్ బీమా తదితర పథకాల వివరాలను పరిశీలించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన..

పట్టణ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. ఓటర్లకు ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తాగునీరు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ర్యాంపులు ఏర్పాటు చేయాలని కమిషనర్ సూచించారు.

ఇసుక, మట్టి దోపిడీదారులు మీరు కాదా?

దేవినేని ఉమా, వసంతపై జ్యేష్ఠ రమేష్‌బాబు ధ్వజం



మాట్లాడుతున్న జ్యేష్ఠ రమేష్‌బాబు

మైలవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైలవరం నియోజకవర్గంలో స్థానికుడైన సర్నాల తిరుపతిరావును నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించడం హర్షణీయమని మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్ బాబు అన్నారు. మైలవరం సీఎంఆర్ కల్యాణ మండపంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ముఖాముఖి కార్యక్రమం ద్వారా పార్టీనే ప్రశ్నించే స్థితికి వచ్చాడన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడు ఇసుక, మట్టి దోపిడీ జరిగిందని బహిరంగంగానే ఉమా ఒప్పుకున్నాడన్నారు. దేవినేని ఉమా మంత్రిగా ఉన్నప్పుడు అయన అనుచరులు ఇసుక, మట్టి అక్రమ రవాణా చేసి సహజ వనరులను దోచుకున్నారని విమర్శించారు. ప్రస్తుత ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అక్రమ ఇసుక, మట్టి రవాణాపై ఆరు నెలల కిందట జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇప్పటికీ ప్రస్తుత ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అనుచరులు వేల ట్రిప్పుల మట్టిని తోటల్లో దాచిపెట్టింది నిజం కాదా అని ప్రశ్నించారు. మట్టి రవాణా ఎవరితో చేయించారు, వారిలో సామాన్యులు ఎంతమంది, ఎమ్మెల్యే వసంత బంధువులు ఎంతమంది అనేది బయట పెట్టాలని డిమాండ్ చేశారు. డబ్బు సంపాదించే పనులు ఎమ్మెల్యే అనుచరులకు, డబ్బు రాని పనులు సామాన్యులకు ఇప్పించి వారిని ఇబ్బందుల పాలు చేశారన్నారు. కరోనా సమయంలో మద్యం షాపుల్లో మద్యం అక్రమంగా తరలించారన్నారు.

ఎమ్మెల్యే వసంత అనుచరులు పక్కనే ఉన్న తెలంగాణ నుంచి లారీల్లో అక్రమంగా మద్యం తీసుకువచ్చి అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. రాజ్యాంగం గురించి మాట్లాడే వ్యక్తులకు అర్హత ఉండాలన్నారు. నిన్నటి వరకు అక్రమంగా సంపాదించుకున్న ఇరువురు నేతలు ఇప్పుడు వాటాలు కుదరక కొట్టుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని మాజీ మంత్రి ఉమా, ప్రస్తుత ఎమ్మెల్యే వసంత ప్రజలకు చెప్పాలన్నారు. వసంత ఇప్పుడు ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవగలడా అని ప్రశ్నించారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



ఇబ్రహీంపట్నం: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి జయంతి కార్యక్రమం ఇబ్రహీంపట్నంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎన్టీటీపీఎస్‌లోని ఏపీఎస్ఈబీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ సహచరిణిగా రమాబాయి నిలిచి తన బిడ్డలను సైతం త్యాగం చేశారని బ్రాంచి అధ్యక్షుడు ఉమా విజయ్‌చంద్ అన్నారు. నాయకులు సీహెచ్‌వీ నారాయణ, ఎస్ఈ వెంకటరావు, డీఈ బాలకృష్ణ, ఏడీఈలు గాంధీ, కిరణ్‌బాబు, ప్రచార కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

- ముసునూరు: మాతా రమాబాయి త్యాగమయ జీవితం అనిర్వచనీయం, ఆదర్శనీయమని జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్ అన్నారు. లోపూడిలోని ఆశ్చర్య పాఠశాలలో బుధవారం భారతరత్న డా.బాబా సాహెబ్ అంబేడ్కర్ సతీమణి మాతా రమాబాయి జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రమాబాయి త్యాగ నిరతిని బాలలకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్యాణి, ధనలక్ష్మి, సుజాత, అనిత, సుజిత, భవానీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన మైలవరం నాయకులు



మైలవరం: రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను మైలవరం మండలం చంద్రగూడెం, వెల్వాడం గ్రామాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు విజయవాడలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి జోగి రమేష్‌ను కలిసిన వారిలో చంద్రగూడెం గ్రామానికి చెందిన సర్పంచ్ బి. శ్రీనివాసరావు, వెల్వాడం సర్పంచ్ పి. ధర్మరాజు, ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు. మంత్రి జోగి రమేష్ వారిని సాదరంగా ఆహ్వానించి విశేషాలు అడిగి తెలుసుకున్నారు.

రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలి

విజయవాడ ఆర్డీఓ భవానీ శంకర్



జి.కొండూరు: జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు స్థలాల రిజిస్ట్రేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని విజయవాడ ఆర్డీఓ భవానీ శంకర్ అన్నారు. వెలగలేరు, హెచ్ ముత్యాలంపాడు గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. భవానీ శంకర్ మాట్లాడుతూ గ్రామ వలంటీర్లు, ప్రజాప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్లు చేయించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం



ఆగిరిపల్లి: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో మండలంలోని ఈదర జట్టు విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం గర్వకారణమని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నపనేని వేణు అన్నారు. ఈనెల 9 నుంచి జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా విజేతగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. క్రీడాకారులను అభినందించి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దన్నపనేని సత్యంబాబు, కోటప్పకొండ ఆలయ ట్రస్ట్ చైర్మన్ రామకృష్ణ కొండలరావు, గోళ్ల ఇస్సాకు, దొండపాటి శామ్యూల్, రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ గ్రామ అధ్యక్షుడు పామర్తి అనిల్, కాస్నుల సాంబయ్య పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి



నూజివీడు: విద్యార్థులు చదువులో ప్రతిభను కనబరచడంతో పాటు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, అప్పుడే భవిష్యత్‌లో రాణిస్తారని కృష్ణా యూనివర్సిటీ ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సెస్ ప్రిన్సిపాల్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు అన్నారు. స్థానిక పీజీ కాలేజీలో బుధవారం కామర్స్, ఎంబీఏ విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రానున్న విద్యా సంవత్సరంలో నూతన భవనాలు విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని, దీంతో మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు. జూనియర్ విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు స్వాగత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో విభాగ సమన్వయకర్త సీహెచ్ రాజారత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.